నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం | మార్చి 19, 2024 | www.navatelangana.com

బాయంపల్లిలో తాగునీటి ఎద్దడి


బోరుబావుల వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని బాయంపల్లి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. వారం రోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడంలేదు. సంబంధిత అధికారులకు సమాచారం అందించినా తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామంలోని చేతిపంపుల వద్ద బోరు మోటార్ల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తుంది. కొంతమంది వ్యవసాయ బోర్ల నుంచి తాగునీటిని తీసుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దు:ఖాన్ని దిగమింగుకొని..

- తండ్రి మృతి.. పది పరీక్ష రాసిన విద్యార్థిని


పరీక్షకు వెళ్తున్న విద్యార్థిని

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కంటి రెప్పలా కాపాడిన తండ్రి దూరమయ్యాడనే బాధ ఓ వైపు.. ఏడాదిగా సిద్ధమైన పరీక్షలు మరోవైపు. ఈ స్థితిలో బంధువులు కలుగజేసుకొని ధైర్యం చెప్పడంతో ఓ విద్యార్థిని పుట్టెడు దు:ఖంలో పదో తరగతి పరీక్షకు హాజరైంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నసురుల్లాబాద్ జీపీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న దండు శ్రీను(38) ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఆయన కూతురు స్రవంతి పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కావాల్సింది ఉండే. తండ్రి చనిపోయిన బాధ ఓ వైపు.. పరీక్ష మరోవైపు ఎటూ తేల్చుకోలేక పోయిన సందర్భంలో బంధువులు ధైర్యం చెప్పి పరీక్షకు పంపించారు.

ఆదిలోనే హంసపాదు

- బీజేపీ నిజామాబాద్, జహీరాబాద్ అభ్యర్థిత్వాల పట్ల క్యాడర్ గరం
- అరవింద్, బీబీపాటిల్‌కు టికెట్ కేటాయింపు పట్ల గుస్సా
- ఓడిస్తామంటూ బహిరంగంగానే ప్రకటన
- ప్రచారంలోకి వెళ్లకముందే కుదుపు



నవతెలంగాణ-నిజాంసాగర్/నిజామాబాద్

లోక్‌సభ ఎన్నికల వేళ.. బీజేపీకి ఆదిలోనే హంసపాదు ఎదురవుతుంది. నిజామాబాద్ టికెట్ అరవింద్‌కు ఇవ్వొద్దంటూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసనలు చేపట్టిన విషయం విధితమే. ఓ కార్యకర్త అయితే ఏకంగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయడం ఇటీవల కలకలం రేపింది. అయితే జహీరాబాద్ అభ్యర్థిగా బీబీపాటిల్‌ను ప్రకటించడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అభివృద్ధీ చేయడం లేదని బీబీపాటిల్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపడితే కేసుల పాలైయ్యామని, మళ్లీ ఆయనకే జై కొట్టేలా టికెట్ కేటాయించారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నిజాంసాగర్‌లో నిర్వహించిన సమావేశంలో సైతం నాయకులు, కార్యకర్తలు ఇదే విషయమై చర్చించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది.

లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సర్వత్రా రాజకీయ వేడీ రాజుకుంది. అభ్యర్థుల ఖరారు మొదలు.. ప్రచారం, పార్టీలో చేరికలపై ప్రధానంగా ఆయా పార్టీలు ఫోకస్ చేస్తున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలకు బీజేపీ నుంచి ధర్మపురి అరవింద్, బీబీ పాటిల్ బరిలో నిలిచారు. సిద్ధాంతాలు గల పార్టీ అని చెప్పుకునే బీజేపీ.. బీబీపాటిల్ బీఆర్ఎస్ నుంచి బీజేపీ తీర్థం పుచ్చుకున్న రెండు రోజులకే టికెట్ కేటాయించడం పట్ల స్థానిక నాయకులు సైతం అవాక్కయ్యారు. పార్టీ కోసం ఏ రకంగానూ పనిచేయని వ్యక్తికి ఎలా టికెట్ కేటాయిస్తారని నాయకులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని కాకుండా డబ్బులున్న వ్యక్తులకు టికెట్ ఇస్తున్నారని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ ఎంపీ అయిన బీబీ పాటిల్ ఎలాంటి అభివృద్ధి పనులూ చేయకపోవడంతో పనుల కోసం బీజేపీ నుంచి నిరంతరం కొట్లాడి కేసులు, జైలు పాలైయ్యామని, ఇప్పుడు అలాంటి వ్యక్తికి టికెట్ ఇవ్వడంతో ఆయనకు జై కొట్టాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. తిట్టిన వ్యక్తికే జై కొట్టాలా అని ప్రశ్నిస్తున్నారు. ఆదివారం నిజాంసాగర్‌లో నిర్వహించి బీజేపీ సమావేశంలో ఇదే అంశంపై నాయకులు చర్చించుకున్నారు. బీబీ పాటిల్ క్యాడర్ మొత్తం కూడా బిజెపిలో చేరి మండలంలో పెత్తనం చెలాయించడం వలన ఏండ్ల నుండి పనిచేస్తున్న కార్యకర్తలను మోసం చేయడమే అని మండలంలోని కార్యకర్తలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే కనీసం ఒక గ్రామం వైపు కూడా కన్నెత్తి చూడని క్యాండెట్‌ను బిజెపి పార్టీ మళ్లీ టికెట్ ఇవ్వడం కార్యకర్తలను మోసం చేయడమే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకే స్థానికంగా ఉండడని ఆయనపై తీవ్ర వ్యతిరేక వ్యక్తమైన తరుణంలో టికెట్ కేటాయించడం వల్ల కాంగ్రెస్‌కు అవకాశం కల్పించినట్టయిందని స్థానికంగా చర్చలు వినిపిస్తున్నాయి. అధిష్టానం.. లోకల్ కార్యకర్తలను, నాయకులను పరిగణలోకి తీసుకోకపోతే.. అధిష్టానానికి గుణపాఠం సైతం చెప్తామంటూ తమ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తుకున్నా.. వినిపించుకోలే

నిజామాబాద్ టికెట్ సైతం అరవింద్‌కు ఇవ్వొద్దంటూ మొత్తుకున్నా.. అధిష్టానం వినిపించు కోలేదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరవింద్ నోటి దురుసు, ప్రత్యర్థులపై ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం, పార్టీ శ్రేణులతో సరైన సఖ్యతగా ఉండకపోవడంతో ఆయనపై ఆది నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నుంచి బరిలో నిలిచి ఓడిపోయారు. అలాంటి వ్యక్తికి ఈసారి టికెట్ ఇవ్వొద్దంటూ అధిష్టానానికి నాయకులు విన్నవిం చినా.. చివరకు అరవింద్‌కే టికెట్ ఖరారు అయింది. దీంతో పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయి.


సీఎంసీ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు

- భద్రపరిచే, కౌంటింగ్ సెంటర్‌లకు కట్టుదిట్టమైన భద్రత
- సీఎంసీ కాలేజీని సందర్శించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- అధికారులకు, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామా బాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో పోల్ అయ్యే ఓట్లను సీఎంసీలోనే లెక్కించనున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఎంసీ కళాశాలలో కొనసాగుతున్న ఏర్పాట్లను, చేపడుతున్న పనులను సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలించారు. ఓట్ల లెక్కింపు పాటు, నిజామాబాద్ అర్బన్, రూరల్ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లను కూడా సీ.ఎం.సీలోనే చేపట్టనున్న సందర్భంగా సంబంధిత గదులను కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. భద్రతాపరమైన అంశాలను నిశితంగా పరిశీలిస్తూ, అవసరమైన మార్పులు, చేర్పులు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్, ఫైర్ అలారమ్స్ ఇతర అన్ని ఏర్పాట్లను చక్కబెట్టాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ కోసం సిసి కెమెరాలను ఏర్పాటు చేసి తగిన బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రతి కౌంటింగ్ హాల్ వారీగా అవసరమైన వాటిని గుర్తిస్తూ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్‌లలో వాటర్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని, అగ్ని ప్రమాదాలు వంటి వాటికి ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని చోట్ల విద్యుత్ వసతి, ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా లేదా అన్నది పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని తన వెంట ఉన్న ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ హాల్ తో పాటు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని, ఎక్కడ కూడా చెత్తాచెదారం ఉండకూడదని అన్నారు. మరమ్మతు పనులను వేగవంతంగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డి, మెప్మా పీ.డీ రాజేందర్, ట్రాన్స్‌కో ఎస్.ఈ రవీందర్, ఏ.డీ.ఈ రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి యోహాన్, ఈ.డీ.ఎం కార్తీక్ తదితరులు ఉన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

తొలిరోజు ప్రశాంతం

- పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్‌లు, అధికారులు


సెంటర్‌లో హాల్‌టికెట్ నెంబర్‌తో సరిచూసుకుంటున్న విద్యార్థులు


సెంటర్‌లో లోపలికి వెళ్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమైయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 141 సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించగా.. 21,914కు గాను 21,870 మంది విద్యార్థులు హాజరు కాగా 44 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. మొదటి రోజు పరీక్ష కేంద్రా లకు అడిష నల్ కలెక్టర్ 3 పరీక్ష కేంద్రాలను, డీఈవో 11 పరీక్ష కేంద్రాలను, డిస్టిక్ లెవెల్ అబ్జర్వర్ 10 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ఏ ఒక్కరు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా హాజరు కాలేదని, ప్రతి పరీక్ష కేంద్రంలో సెట్టింగ్ స్కాడ్స్ 141 మంది విధులు నిర్వహించారని అన్నారు.

కామారెడ్డి జిల్లాలోని 62 పరీక్ష కేంద్రాలలో 11,962 మంది విద్యార్థులకు గాను 11,940 మంది విద్యార్థులు హాజరయ్యారు. 22 మంది విద్యార్థులు గైరాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తెలిపారు. ప్రైవేట్‌గా పరీక్ష రాయడా నికి 24 మంది విద్యార్థులకు గాను ఐదుగురు హాజరయ్యారు. 19 మంది గైరాజరైనట్లు తెలిపారు.

కాగా కామారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వాగ్దేవి హై స్కూల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ తీరు పై సంతృప్తిని వ్యక్తం చేశారు.


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


పిల్లలతో కలిసి సెంటర్‌కు వచ్చిన తల్లిదండ్రులు


కామారెడ్డిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

బీజేపీ గాంధారి మండల అధ్యక్షులుగా మధుసూదన్‌ను ఎన్నుకున్నారు. గాంధారి మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ ప్రభారీ నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగ రావు, అసెంబ్లీ విస్తారక్ అశోక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా బి శ్రీకాంత్ గౌడ్ , బి రాంసింగ్,మండల ఉపాధ్యక్షులుగా బి రాజిరెడ్డి, ఏం గోపాల్, సంగెం రాజు, జె రమేష్ ,మండల ఎస్ టి మోర్చా అధ్యక్షులుగా ఎన్ నవీన్,గాంధారి టౌన్ అధ్యక్షులుగా గంగి రమేష్,గాంధారి టౌన్ ప్రధాన కార్యదర్శులుగా తూర్పు రాజశేఖర్, రాందిని, బాలకృష్ణ,గాంధారి టౌన్ ఉపాధ్యక్షులుగ తాడ్వాయి రవి, బి వాసు, రఘుపతి, నవీన్, పట్టణ కోశాధికారిగా కుమ్మరి రాహుల్ పట్టణ కార్యదర్శిగా తాడ్వాయి కిషన్ లనుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మైన్స్ అండ్ జియాలజీ సహాయ సంచాలకులుగా నగేష్

నవతెలంగాణ-కామారెడ్డి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేత

నారాయణ పేట జిల్లా నుండి బదిలీ పై వచ్చిన నగేష్ మైన్స్ అండ్ జియాలజీ సహాయ సంచాల కులుగా సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇక్కడ సహాయ సంచాలకులుగా పనిచేసిన క్రాంతి కుమార్ ఇటీవలే బదిలీ అయిన విషయం విదితమే.

ఎన్నికల నోడల్ అధికారులు అవగాహన, నిబద్ధతతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ప్రారంభం


అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

లోకసభ ఎన్నికలు సజావుగా నిర్వహించుదుటకు నియమించిన నోడల్ అధికారులు, వివిధ బృందాలు ప్రవర్తనా నియమావళిపై పూర్తి అవగాహన కలిగి సమిష్టిగా నిబద్ధతతో పనిచేయాలని, ఏదైనా ఎదుర్కొనుటకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ కు సువిధ, 1950 వచ్చే ఫిర్యాదుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వంద నిముషాలలో పరిష్కరించే విధంగా ప్లైయింగ్ స్క్వాడ్ బృందాలను అప్రమత్తం చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలు, టి.వి. దినపత్రికలలో వచ్చే ప్రకటనలు, చెల్లింపు వార్తలు, టి.వి. న్యూస్, యు ట్యూబ్, వే టు ఎస్ ఏం ఎస్, తదితర వాటిపట్ల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి చూడడంతో పాటు గుర్తించాలని అన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదేరోజు అందించే విధంగా ఎంసిఎంసి పనిచేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలకు, నాయకుల సమావేశాలు నిర్వహించుకునేందుకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని చెప్పారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా సామాజిక మాధ్యమాలలో ఎన్నికల యంత్రాంగంపై అపోహలు సృష్టించేలా వచ్చే ఫేక్ న్యూస్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఖండించాలని సూచించారు. సువిధ యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిబంధనల ప్రకారం సకాలంలో రాజకీయ పార్టీలకు అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చి ప్రతి ఫిర్యాదును వెంటనే సంబంధిత బృందాలకు సమాచారం అందించి పరిష్కరించేలా చూడాలన్నారు. సీజ్ చేసిన డబ్బులు, ఇతర ఆభరణాలు ఏడు రోజుల కంటే ఎక్కువ గ్రీవెన్స్ కమిటీ వద్ద ఉండవద్దని, సంబంధిత వ్యక్తులు నగదుకు సంబంధించిన ఆధారాలు సమర్పించకపోతే వెంటనే ఎఫ్ఐ ఆర్ బుక్ చేయాలని కోరారు. సి విజిల్ పరిశీలన చేసే అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డబ్బు, మద్యం, విలువైన వస్తువుల పంపిణీ జరిగితే సి విజల్ ద్వారా ప్రజలు ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపాలన్నారు. ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రూపాయలు యాభై వేల నుంచి పది లక్షల వరకు జరిగిన జప్తు సొమ్ముకు సరియైన ఆధారాలు జిల్లా గ్రీవెన్స్ కమిటీ దగ్గర ప్రవేశ పెడితే విడుదల చేయాలని, 10 లక్షల రూపాయలకు మించి జరిగిన జప్తు వివరాలు ఐటి శాఖకు అప్పగించాలని అన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు బావయ్య, మురళి కృష్ణ, అంబాజీ, కొకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏ.ఓ. మసూరి అహ్మద్, ఎన్నికల సూపరింటెండెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/s Shriram Finance Ltd, Metpally Branch, Dist Jagityal agreed to accord Loan to Dhodolla Rajaram Yadav S/o Bhoomaiah, Aged 48 Yrs, Occ: Business, R/o H.No.4-75, Talla Rampur Vilalge, Morthad (M), Nizamabad (Dist) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within 7 days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the Open Place in Sy No.126 admeasuring 1509 Sq.fts equal to 168 Sq.yds or say 140.1 Sq.Mtrs situated at Talla Rampur Village of Yergatla Mandal (Old Morthad Mandal), Nizamabad (Dist) within the limits of Gram Panchayat Talla Rampur, under the jurisdiction of Regn.Sub Dist Bheemgal and Regn.Dist. Nizamabad (Subject Matter of the Regd.Sale Deed Doct No.3307/2012 Dtd.26.12.2012 SRO Bheemgal)

Boundary as
East :Road Kammarpalli to Tadpakal (33'.0" fts wide)
West : Land of Golla Bhumanna
North : Open place of Rampalli Rajaram
South : Part of same Open Plot of Dhodolla Narsu (Sold By Rajaram Yadav)

(R.JAGADISHWER RAO)
Advocate

IN THE COURT OF THE HON'BLE PRL. DIST JUDGE AT KAMAREDDY
G.W.O.P No.01 of 2024

Between: Arshiya Begum ...Petitioner
And
1. The Sub Registrar, Sub Registrar Office, Kamareddy.
2. To whom so ever it may concern,
To, ..Respondents.

To whomsoever it may concern.

Whereas the petitioner has filed a petition for appointment as legal guardian of her minor grandchildren namely i)Syed Mansoor Ali S/o Late Syed Saber Ali, ii) Syed Maqsood Ali S/o Late Syed Saber Ali and iii) Syed Qizar Ali S/o Late Syed Saber Ali and also accord permission to execute necessary regd. documents in respect of below mentioned schedule property on behalf of minors.

SCHEDULE OFPROPERTY

Open Plot No.7 lies in Sy No.116/H, I, J vide GP LP No.2/2001, admeasuring North to South: 30.0 Feet, and East to West: Northern side: 60.5 Feet and Southern side: 61.0 Fee, total area of which 1822.5 Sq Feet (202.5 Sq Yards) equivalent to 168.0 Sq Mtres, bounded by:
North : Open Plot No.8
South : Open Plot No.6
East : 30.0 Feet wide Road
West : Land of Neighbourssituated at Elchipur village, Kamareddy Mandal & District.

Take notice that the above OP posted on 28-03-2024 at 10.30 AM who ever may have objection, they may appear on the said date before this Hon'ble Court in person or through Advocate, failing which the matter will be heard and decided in exparte.

//By order of the Court//
B.ANGRAJ SHABANA BEGUM
ADVOCATES
KAMAREDDY
Cell : 99898 14906

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE AT NIZAMABAD
O.S.NO. 375 OF 2023

Between
UNION BANK OF INDIA having its head office at MUMBAI and branches among other places one branch at Indalwai, Nizamabad, Represented by its chief Manager Sri M. Srinivas S/o. M.Bheemaiah Age (38) years R/o Dist. Nizamabad.
Plaintiff
AND
Mr. Vadla Rajeshwar, S/o. Rajanna, Age: 57, Occ: Business, R/o. H. No.3-109, Gannaram Village, Indalwai Mandal, Dist: Nizamabad.
Defendant
To
Mr. Vadla Rajeshwar, S/o. Rajanna, Age: 57, Occ; Business, R/o. H. No.3-109, Gannaram Village, Indalwai Mandal, Dist: Nizamabad.

Whereas in the above suit filed by the plaintiff herein against above Defendant for Recovery of Amount. Several times summons have been sent to you by post and also through Court but the same were returned un served.

TAKE NOTICE THAT the above case stands posted on 03-04-2024 for your appearance. If you fail to appear before the Court of Hon'ble Junior Civil Judge, Nizamabad on the said date of hearing at 10.30 A.M., the matter will be heard and decided in your absence setting you exparte.

//BY ORDER OF THE COURT//
Sd/-
R.SRI RAMA GOUD.
R.S.L.Goud ADVOCATE,
NIZAMABAD.
Cell : 98488 50088

తెలంగాణలో అన్నీ ఎంపీ సీట్లు కాంగ్రెస్ స్వీప్ చేస్తది

- ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణలో అన్నీ ఎంపి సీట్లను కాంగ్రెస్ స్వీప్ చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజేపి-కాంగ్రెస్ మధ్య మాత్రమే పోటీ ఉంటుందని, బీఆర్ఎస్‌కు నామమాత్రంగా ఓట్లు పడతాయని చెప్పారు. ప్రజలపక్షంలో బీఆర్ఎస్ పోటీలో లేదన్నారు. ఇక లిక్కర్‌స్కామ్‌లో కవిత ఇరుక్కుందని, ఆమె ఎప్పుడో లోపలికి వెళ్ళాల్సింది ఇప్పుడు వెళ్లిందన్నారు.

వైరస్ సోకకుండా పశువులకు టీకాలు

- మండల పశువైద్యాధికారి శిరీష

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పశువులకు గాలి ద్వారా వైరస్ సోకకుండా ఉండడానికి టీకాలు ఇస్తున్నామని మండల పశువైద్యాధికారి శిరీష అన్నారు. సోమవారం మండలంలోని చింతలూరు, మనోహర బాద్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఆశోక్, గోపాలమిత్ర రాజకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

ప్రధానిని కలిసిన అసెంబ్లీ కన్వీనర్

నవతెలంగాణ-ఆర్మూర్



లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగిత్యాలకు వచ్చిన ప్రధాని మోడీని అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సైతం పాల్గొని ప్రసంగించారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-సిరికొండ

ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రజలు అవగాహనా పెంచుకోవాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపికెఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపును ఇచ్చారు. మండలం లోని గడ్కోల్, రావుట్ల గ్రామాల్లో మార్చ్ 19, 20 గ్రేస్ పౌండషన్ సౌజన్యంతో ఏఐపికెఎంఎస్, పిఓడబ్ల్యూ, ఏఐపికెఎస్, ఐఎఫ్టీయూ, పివైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్యాన్సర్ రోగ నిరోధక "ఉచిత వైద్యశిబిరం" గురించి సోమవారం మండలం లోని గడ్కోల్ గ్రామంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ప్రజల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. క్యాన్సర్ మహమ్మారి ముఖ్యంగా ప్రజల్ని కబలిస్తుందని, రాకముందే నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. క్యాన్సర్ అనేది శ్రామిక మహిళాకు శాపంగా మారిందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం ఆర్మూర్ డివిజన్ లో గడ్కోల్, రావుట్ల, మోర్తాడ్, మచ్చర్ల తదితర 4చోట్ల ఉచిత హెల్త్ క్యాంప్ లను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలు ఉచిత వైద్యఆరోగ్య శిబిరంను ఉపయోగించుకోవాలి అని అయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. రమేష్,, ఏఐపికెఎస్, ఐఎఫ్టీయూ, పిఓడబ్ల్యూ పివైఎల్, జిల్లా, డివిజన్ నాయకులు దామోదర్, లింబాద్రి, కిషోర్, అనిస్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వెల్మల్ మాజీ సర్పంచ్ సాయమ్మ



మాజీ సర్పంచ్ సాయమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని వెల్మల్ గ్రామ మాజీ సర్పంచ్ మచ్చర్ల సాయమ్మ పెద్ద గంగారాం బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటిదాకా 5 హామీలను అమలు చేసినట్లు వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గనికి కావాల్సిన నిధులను తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యకర్తల ఇంటింటికి వెళ్లి పలకరిస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల గురించి వారితో పలు విషయాలను చర్చించారు. గ్రామ నాయకులు గంగాధర్, శ్రీకాంత్, చిన్న గంగన్న ,సాయులు గురు, రమేష్, గంగాధర్, పోశెట్టి, భోజన్న శ్రీను, సాయన్న నాగన్న పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ నిజాం సాగర్ కెనాల్ ఛైర్మెన్ యల్లా సాయిరెడ్డి, నందిపేట్ మండల అధ్యక్షులు మంద మహిపాల్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, వెల్మల్ గోపి, అల్లకొండ లింగం, పిప్పెర సాయిరెడ్డి, ప్రశాంత్, ఎంపిటిసి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్మయి సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. జక్రాన్ పల్లి మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో పోషకాహార వారోత్సవాల్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసిల్దార్ కిరణ్మయి హాజరై ప్రసంగించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లల తల్లులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పాటించాలన్నారు. అంగన్వాడి పాఠశాలలో ఇస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు అంగన్వాడి సూపర్వైజర్ ఎస్తేరు రాణి, ఏపిఎం రవీందర్ రెడ్డి జక్రాన్ పల్లి సెక్టార్ అంగన్వాడి టీచర్లు గర్భిణి స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు

ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

శివరాత్రి రోజున పోచంపాడు లక్ష్మీకాల్వలో గంగా స్థానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయాలని సోమవారం కలెక్టర్‌కు ఎంపీటీసీ అంకం లక్ష్మి జయప్రకాష్, పుప్పాలపల్లి మాజీ సర్పంచ్ జయప్రకాష్ వినతిపత్రం సమర్పించారు. మండలంలోని గన్యాతాండకు చెందిన ముగ్గురు యువకులు శివరాత్రి రోజున గంగ స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోవడం జరిగిందని తెలిపారు. చనిపోయిన కుటుంబాలు కూలి పని చేసుకుని బతుకుతారని, అత్యంత నిరుపేదలని వారి పట్ల కనికరించి ప్రభుత్వం ద్వారా తక్షణ ఆర్థిక సహాయం అందజేయాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు.

శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సూచనలు

నవతెలంగాణ-ముప్కాల్

రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతు వేదికల నుంచి స్థానిక రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నేరుగా మాట్లాడే కార్యక్రమంను మంగళవారం ఉదయం 10 గంటలకు ముప్కాల్ రైతు వేదికలో ప్రారంభించడం జరుగుతుందనిమండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి సాగు, ఆయిల్ ఫామ్, ఈ వేసవి కాలం వివిధ కూరగాయ పంటల్లో వాడే పురుగుల మందుల వివరాలను ఆయా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సాగు పద్ధతుల గురించి తెలపడం జరుగుతుందని అన్నారు. అందుకుగాను అధిక సంఖ్యలో రైతులు పాల్గొని వివిధ పంటలకు సంబంధించిన సాగు పద్ధతులను నేర్చుకోవాల్సిందిగా రైతులకు ఈ సందర్భంగా సూచించారు.

అక్రమ ఇసుక నిలువల టెండర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో ఈనెల 14న అక్రమ ఇసుక నిల్వలను ఏడి మైన్స్ రెవిన్యూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం టెండర్ నిర్వహించారు. మనోహరాబాద్ గ్రామ పంచాయతీ ఆవరణలో 58 ట్రాక్టర్ల ఇసుకను టెండర్ వేశారు. మనోహరబాద్ గ్రామానికి చెందిన కూడా చిన్న గంగారం 1,21,500కు టెండర్లు దక్కించుకున్నారు.

అనుమతులపేర కొండల్ని తవేస్తున్నారు..

- రోజంతా ఒకే వేబిల్లు
- టిప్పర్ రూ. 3 వేల నుంచి రూ. 3500

నవతెలంగాణ-మాక్లూర్

అనుమతులు ఉన్నాయంటూ కొండలను తవ్వేస్తూ మొరం మాఫియా అక్రమార్జన చేస్తోంది. మండలంలోని సింగంపల్లి గ్రామ శివారులోని 51/2 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో నుంచి అనుమతులు తీసుకొని ఒక్కో వేబిల్లుతో సుమారు ఎనిమిది టిప్పర్లను తరలిస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతుల పేరుతో కొండల్ని తవ్వి మొరాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మొరం మాఫియా సిండికేట్‌గా మారి అనుమతులు ఒక్కరిపై ఉంటే టిప్పర్లు గల వ్యక్తులంత ఏకమై కొండల్ని తవ్వేస్తున్నారు. ఒక్కో టిప్పరు సుమారు రూ. 3 వేల నుంచి రూ. 3500 వరకు అమ్ముకుంటున్నారు.



జరిమానా చెల్లించకుండానే మళ్ళీ తవ్వకాలు...

గతంలో అనుమతులు ఒక్క చోట తవ్వకాలు మరో చోట జరిపారని పుప్పాల గంగారెడ్డి అనే వ్యక్తికి రూ. 89,22,900 లక్షలు జరిమానా మైనిగ్ అధికారులు వేశారు. జరిమానా చెల్లించకుండా మళ్ళీ తవ్వకాలు జరుపుతున్నారు. అప్పటి నుంచి గంగారెడ్డి కుటుంబ సమేతంగా పరారీలో ఉన్నట్లు సమాచారం. ఆయన పేరుపై అనుమతులు ఉన్న చోట తవకాలు జరుపుతున్నారు.

ఆయన లేకుండానే ఆయన పేరుతో మొరం తవ్వకాలు ఎలా జరుపుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ తవ్వకాల్లో మాజీ ఎమ్మెల్యే బావమర్ది 20శాతం వాటాను మరొకరికి అమ్ముకోవడంతో ఆయన వాహనాలు పెట్టి మొరాన్ని తరలిస్తున్నారు.

మైనింగ్ అనుమతికి మాకు సంబంధం లేదు

తహసిల్దార్ షబ్బీర్

రెవెన్యూ నుంచి కాకుండా జిల్లా మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందారు. రెవెన్యూ కు ఎలాంటి సంబంధం లేదు.

జీపీ కార్మికుల బకాయి వేతనాలను ఇప్పించాలి

- వేతనాలు పెంచి, క్రమబద్ధీకరించాలి
- డీపీవోకు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దాసు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. జిల్లాలో నెలల తరబడి వేతనాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. సోమవారం డిపిఓకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ..కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన అన్నారు. మరణించిన కార్మికులకు దహన సంస్కారాలకు 20వేలు, నష్టపరిహారం 10 లక్షలు ప్రభుత్వమే ఇచ్చేటట్లు చూడాలని ఆయన కోరారు. వారాంతపు, పండుగ సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా ఈనెల అధ్యక్ష కార్యదర్శులు కాజా మొయినద్దీన్ ,జేపీ గంగాధర్, భానుచందర్, దాల్మల్కి పోశెట్టి సంతోష్, శ్రీనివాస్, సుధాకర్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



డీపీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

హాస కొత్తూర్‌లో నేడు మహాదేవ స్వామి జాతర

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నపూర్ణ సమేత మహా దేవస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అధ్యక్షుడు కొమ్ముల రజినీకాంత్, కార్యదర్శి కుందరం శ్రవణ్, ఉప అధ్యక్షుడు రాజుల బావులు సోమవారం తెలిపారు. స్వామివారి కళ్యాణోత్సవం, భక్తులకు అన్న వితరణ కార్యక్రమం, సాయంకాలం స్వామి వారి రథోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

- తాజా మాజీ సర్పంచ్ అనుచరులతో కలిసి చేరిక

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ తాజా మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పలువురికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముప్కాల్ మండల కేంద్రంలోని మణికంఠ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీల్ రెడ్డి మాట్లాడుతూ 2023-అసెంబ్లీ ఎన్నికల్లో సమీప అభ్యర్థి చేతిలో 4 వేల స్వల్ప ఓట్ల తేడాతో ఓడిన బాల్కొండ నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతానని అన్నారు. ముప్కాల్ మండల ప్రజల ఆశీస్సులు ఉంటే చాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు, తాజా మాజీ వార్డు సభ్యులు, మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో వేంపల్లి సొసైటీ ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కు రాజేశ్వర్, ముప్కాల్ మాజీ సర్పంచ్ దాసరి లక్ష్మీ ముస్కు ముత్తెన్న, ముప్కాల్, మోర్తాడ్, కమ్మర్ పల్లి, ఏర్గట్ల మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలేటి రాములు, ఏలేటి విజయ్ రెడ్డి, పోల ప్రవీణ్, అక్బార్, బద్దం సాగర్ రెడ్డి, చందా రవి, లోక సుభాష్, మల్లారెడ్డి, ప్రశాంత్, ముస్కు శ్రీను, రాజ్ కుమార్, నాయకులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

ఎస్‌బిఐ ఇంటర్ రీజినల్ క్రికెట్ టోర్నీ విజేత కామారెడ్డి జట్టు

- రెండో స్థానంలో జిల్లా జట్టు



ట్రోఫీని అందుకుంటున్న కామారెడ్డి జట్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రీజినల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యకాంత దాస్ ఆదేశాల మేరకు రీజినల్ ఏఓ హెచ్‌ఆర్ శ్రీకాంత్, సత్యనారాయణ, కెప్టెన్ సంజీవ్, రాజు, వినయ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన వన్డే ఇంటర్ రీజినల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కామారెడ్డి జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్లో అదిలాబాద్, మంచిర్యాల్, గోదావరిఖని, నిజామాబాద్, కామారెడ్డి రీజినల్ ఆఫీస్ జట్లు పాల్గొన్నాయి. వీరికి లీగ్ నాకౌట్ మ్యాచ్లు నిర్వహించారు మొదటి సెమిఫైనల్ మ్యాచ్లో కామారెడ్డి మంచిర్యాల్ మధ్య జరిగిన మ్యాచ్లో కామారెడ్డి జట్టు మంచిర్యాల్ జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్‌లో నిజామాబాద్ జట్టు గోదావరిఖని జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్, కామారెడ్డి జట్లు తెలపడగా కామారెడ్డి జట్టు నిజామాబాద్ జట్టుపై విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. టోర్నీ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యకాంత దాస్ హాజరై బ్యాటింగ్ చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పుడు బ్యాంకుల్లో బిజీగా ఉండే ఉద్యోగులు ఆటవిడుపు కోసం టోర్నమెంట్లలో పాల్గొనడం గర్వకారణమని, క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని కోరారు. అనంతరం గెలిచిన జట్టుకు మెమొంటో లను అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో మాన్ ఆఫ్ ద మ్యాచ్ గా భాస్కర్ (కామారెడ్డి) మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కె అరవింద్ (నిజామాబాద్)నిలిచారు. కార్యక్రమంలో ఆర్‌ఎం లు శ్రీకాంత్, సంజీవ్ అనూపం ఆదర్శ్, దీనానాత్‌జా, ఇతర జోన్ల క్రీడాకారులు శ్యామ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

పోషణా పక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి-6 అంగన్వాడీ కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సిడిపిఓ భార్గవి ఆదేశానుసారం గర్భిణీలకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, తల్లిపాలపై అవగాహన, చిరుధాన్యాలు నిత్యం జీవితంలో ఒక భాగం కావాలని అన్నారు. పోషకాలతో కూడిన వంటల గురించి తెలియజేస్తూ, 3-6 సంవత్సరాల పిల్లలని అంగన్వాడీ కి పంపించాలని, వారికి పోషకాహారంతో పాటు ప్రీ- స్కూల్ విద్య చెప్పడం జరుగుతుందని ఏసిడిపిఓ ఆర్ జ్యోతి తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లల అభివృద్ధి కార్డులను వారి పేరెంట్స్‌కి ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఏ శ్రీదేవి, టీచర్లు జగదాంబ, గోదావరి, సంగీత, శైలజ, రజిని, పద్మ, లక్ష్మి, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

మొదటిరోజు ప్రశాంతంగా పది పరీక్షలు

సోమవారం ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షల కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీసులు సైతం పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు చేపట్టారు..

నవతెలంగాణ- విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి : మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. మొత్తం 467మంది విద్యార్థులకు గాను 465మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమ్మర్ పల్లి పరీక్షా కేంద్రంలో ఒకరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనా సముందర్ పరీక్ష కేంద్రంలో ఒక్కరు చొప్పున గైర్హాజర్ అయినట్లు తెలిపారు.

ముప్కాల్ : మండలకేంద్రంలోని పదోతరగతి విద్యార్థులు మొదటి రోజు 154 మంది విద్యార్థులకుగాను అందరూ హాజరయ్యారని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని రెంజర్ల ఉన్నత పాఠశాలలో 57 విద్యార్థులకు గాను 57 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

సిరికొండ : మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలురు 223 మంది, బాలికలు 314 మంది హాజరయ్యారని ఇన్‌ఛార్జి ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. మండలంలోని పడకల్, తొర్లికొండ, అర్గుల్, జక్రాన్‌పల్లి సెంటర్లలో 486 మంది గాను 486 మంది హాజరై పదో తరగతి పరీక్షలు రాసినట్లు తెలిపారు.

నవీపేట్ : మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. 621 మంది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు మండల విద్యాధికారి గణేష్‌రావు తెలిపారు.తెలుగు పరిక్షకు 621 మంది హాజరైనట్లు తెలిపారు.

ధర్పల్లి : మండలంలోని దుబ్బాక,రాముడు,ధర్పల్లి కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 9 గంటల వరకు తమ తమ సెంటర్లకు విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థులకు ఇన్విజిలేటర్లు తనిఖీల అనంతరం పరీక్షా హాల్లోకి అనుమతించారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 146 మందికి గాను 146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ ఆంధ్రయ్య తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించాలని, పరీక్ష రాసేటప్పుడు ప్రశ్నపత్రంలో ఉన్న ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదివి సరైన జవాబులు రాయాలని,ఎలాంటి కొట్టివేతలు లేకుండా చక్కని చేతి రాత కలిగివుండాలని అన్నారు. ప్రతి ప్రశ్నాపత్రంపై ఎన్ని పేజీలు ఉంటే అన్ని పేజీలపై విద్యార్థి హల్ టికెట్ నంబర్ వేయాలని కోరారు. ప్రతి జవాబు పత్రంపై మెయిన్ ఆన్సర్ షీట్ నంబర్ వేయాలని, ఏ జవాబు రాస్తున్నారో ఆ జవాబు నంబర్ కచ్చితంగా వేయాలని అన్నారు. తొలిరోజు చేసిన తప్పులు పునరావృతం కావద్దని విద్యార్థులకు సూచించారు.

బాల్కొండ: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 100కు 100శాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 209 విద్యార్థులు, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 210, కిసాన్ నగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 69 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారని అన్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు ఉపాధ్యాయులు విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించి పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించారు. పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాల్కొండ ఎస్సై కే గోపి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.



ధర్పల్లిలో పరీక్ష రాయడానికి వెలుతున్న విద్యార్థులు

26 నుంచి వృత్తి విద్య కోర్సుల శిక్షణ

- సెట్విన్ సంస్థ కోఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్

నవతెలంగాణ-కామారెడ్డి

సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్య కోర్సులల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నామని సెట్విన్ సంస్థ కో-ఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, ఎంఎస్ఆఫీసు, ట్రైలరింగ్ ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహెందీ కోర్సులో ఈ నెల 26 నుంచి మూడు మాసాల పాటు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. 10వ తరగతి ఉతీర్ణులైన వారు అర్హులని తెలిపారు. కోర్సు ఫీజులో 50 శాతం రాయితీతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించనున్నామని ఆయన పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన అనంతరం సెట్విన్ సంస్థ ద్వారా నిర్వహించే పరీక్షలో ఉతీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 7386180456 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉమెన్ ఎనర్జీ ఇంటర్నేషనల్ అవార్డు పొందిన కామారెడ్డి వాసి

నవతెలంగాణ-కామారెడ్డి



అవార్డును అందుకుంటున్న చితల పోశవ్వ

ఉమెన్ ఎనర్జీ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్‌లో భాగంగా హైదరాబాద లోని గచ్చిబౌలిలో నిర్వహించిన అవార్డ్స్ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చింతల పోశవ్వ నిర్వహిస్తున్న దివ్య హస్తం ఆర్గానిక్ ప్రొడక్ట్స్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు గా చేస్తున్న సామాజిక సేవలకుగానూ తెలంగాణ ఉమెన్ ఎనర్జీ అవార్డ్ 2024ను పొందారు. ఈ సందర్భంగా దివ్య హస్తం ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ప్రొప్రైటర్ చింతల పోషవ్వ మాట్లాడుతూ.. ఈ అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రైతు సహకార సంఘం అభివృద్ధికి కృషి

- అధ్యక్షులు శ్రీహరి బాలాజీ


మాట్లాడుతున్న అధ్యక్షులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద రైతు సహకార సంఘం ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేసి రైతులు పండించిన పంటలు కొనుగోలు చేసి రైతు సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అధ్యక్షులు శ్రీహరి బాలాజీ అన్నారు. సోమవారం బిచ్కుంద మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం నూతన గోదాంలో 56వ మహాజన సభ నిర్వహించారు. ముందుగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జమ ఖర్చులు, కొనుగోళ్ల ఇతర వివరాలతో పాటు అర్ధవార్షిక నివేదికలు సిబ్బంది చదివి వినిపించారు. అధ్యక్షులు శ్రీహరి బాలాజీ మాట్లాడుతూ.. ఎస్బిఐ బిచ్కుంద బ్రాంచ్ ఆధ్వర్యంలో సహకార సంఘానికి చెల్లిస్తున్న డబ్బులపై అధిక వడ్డీ వేయడం పంట రుణాలపై తొమ్మిది శాతం వడ్డీ వసూలు చేస్తుండడం వల్ల సంఘం పరిధిలోని రైతులు తీవ్ర నష్టం కలుగుతున్నదని అన్నారు. పంట రుణాలపై వడ్డీ శాతం తగ్గించే విధంగా చూడాలని విన్నవించారు. మనగ్రీడ్ కంపెనీ ద్వారా రైతులకు రోటివేటర్స్, స్ప్రింక్లర్స్, కల్టివేటర్ తదితర పనిముట్లు అందజేయనున్నట్టు, అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోవు సీజన్‌లో రైతులు విత్తనాలు, ఫర్టిలైజర్ బ్యాగులు అందుబాటులో ఉంచాలని అన్నారు. గత రెండు రోజులుగా ఈదురుగాలుతో కూడుకున్న వర్షం పడటంతో రైతులు పండించిన పంటలకు తీవ్ర నష్టం వాటిలిందని ప్రభుత్వం నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు 30 లక్షల కొత్త రుణాలు మంజూరు, సంఘం గోదాం ఆవరణలో సీసీ రోడ్డు వేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి కిరణ్, ఉపాధ్యక్షులు యాదవరావు, సంఘం డైరెక్టర్లు దర్పల్ సంజు, పోతుల అశోక్, శంకర్ నాయక్, సాయిని శంకర్, అనిశెట్టి శివరాజ్, చంద్రకాంత్ పటేల్, గణపతిరెడ్డి, గైనియాదవ్‌రావు, సీఈవో శ్రవణ్ కుమార్, క్యాషియర్ సచిన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొందరి హర్షం.. మరికొందరి నిరుత్సాహం..

- బాన్సువాడ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు
- కాసుల బాలరాజ్‌కు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల.. గాంధీభవన్ ముట్టడికి తరలిన నేతలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్


హైదరాబాద్ గాంధీభవన్ ముందు నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో వర్గ రాజకీయం భగ్గుమంది. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకు దిగజారే పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసుల బాలరాజ్‌కు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల వర్ని, బాన్సువాడకు చెందిన సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీభవన్ ముట్టడికి తరలివెళ్లారు. వర్ని మండలం, బాన్సువాడ మండలం మరో నేత ఆధ్వర్యంలో నియోజవర్గంలో 9 మండలాలు ఉండగా కొన్ని మండలాలకు మాత్రమే వాహనాలను పంపి కార్యకర్తలను వివిధ పార్టీలో కొత్తగా చేరిన కార్యకర్తలను పోగుచేసి భారీ వాహన ర్యాలీతో గాంధీ భవన్ ముట్టడికి బయలుదేరారు. గత కొన్ని సంవత్సరాలుగా బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తూ బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాసుల బలరాజ్‌కు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ పదవి ఇవ్వడంతో కొందరు జీర్ణంచుకోలేకపోతున్నారని అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో గత మూడు నెలల నుంచి వివిధ పార్టీల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారు సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. సీనియర్ నాయకుల్లో ఏమిటి ఈ వర్గపోరు అంటూ అవాక్కైతున్నారు. నియోజవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేయగా.. మరో వర్గం నిరసన వ్యక్తం చేస్తుంది. నూతనగా కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్యకర్తలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానికి స్వాగతం పలికిన మేడపాటి



నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జగిత్యాలలో సోమవారం నిర్వహించిన విజయ సంకల్ప సభకు హాజరైన ప్రధానమంత్రి నరేంద్రమోడీని హెలిప్యాడ్ వద్ద బోధన్ నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ సంకల్ప సభకు బోధన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సోమవారం పంపిణీ చేసినట్టు వెటర్నరీ డాక్టర్ విట్టల్ పేర్కొన్నారు. పశు వైద్య సిబ్బంది మూడు బ్యాచ్‌లుగా ఏర్పడి గ్రామంలో సుమారు 400 పశు వులకు టీకాలను పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వెటర్నరీ శశికళ, భీమ్‌రావు, సిబ్బంది నవీన్, లక్ష్మణ్, సావిత్రి, గోపాల మిత్రలు భాస్కర్‌గౌడ్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

బోర్గాంలో ఇంటి పన్ను వసూళ్లు


పన్ను వసూలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి సుమన్ తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశాలు రావడంతో, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రూ.17వేలు వసూలు చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుమన్, మౌలాలి తాండ గ్రామ కార్యదర్శి రజిత, కారోబార్ మహేందర్‌రెడ్డి, సంతోష్ తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న గార్గే


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో పాత పోతంగల్ బారడి పోచమ్మ మందిరం వద్ద నీటి సమస్య ఏర్పడటంతో ఈ సమస్యను భాజపా రాష్ట్ర నాయకులు గార్గే శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. అందులో భాగంగా సోమవారం బోరువేయించారు. దీంతో గ్రామ పెద్దలు యువకులు హర్షం వ్యక్తం చేస్తూ గార్గేను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాకయ్య, రాజాసింగ్, పోతంగల్ మండల ప్రధాన కార్యదర్శి పబ్బ శేఖర్, సీనియర్ నాయకులు గంధపు హన్మండ్లు, సూదంశంకర్, సూదం నాగభూషణం, గంట్ల శ్రీనివాస్, పబ్బ విఠల్, గోపూరి హన్మండ్లు, కుమ్మరి హన్మండ్లు, మేత్రి శివరాజ్, దత్తు, ప్రేమ్‌పటేల్, ఉమేష్, పోతంగల్ మండల ఐటీ సెల్ నాయుకులు ఎర్ర సాయినాథ్, యూత్ సభ్యులు పబ్బ అనిల్, వీరు, అఖిల్, సంజీవ్, చరణ్, దత్తు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరా తహసీల్దార్‌గా ఎం.రమేష్



నవతెలంగాణ-బోధన్

సాలూరా మండల నూతన తహసీల్దార్‌గా ఎం.రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సాలూరా తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఆర్.రమేష్ బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేయడంతో ఎం.రమేష్ సాలూరా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తా

- సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి తెలిపారు. మండలం కేంద్రంలోని సహకార సంఘంలో సోమవారం సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ అధికారులు సొసైటీలో జరిగిన లావాదేవీల గురించి సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ.. సొసైటీ ద్వారా రైతులకు ఎరువు మందులు, విత్తనాలను అందుబాటులో ఉంచామని, రానున్న రోజుల్లో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో జొన్న పంట ఎక్కువగా ఉండడంతో గత ఏడాది కూడా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, వర్షాల కారణంగా నల్లబడిన జొన్నలను కూడా అప్పటి ప్రభుత్వం కొనుకుందని ఇప్పుడు కూడా జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, సీఈఓ సందీప్, సంజీవ్, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సజ్జనపల్లె గ్రామానికి చెందిన అగ్ని బాధిత కుటుంబానికి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో నీల పోచయ్య గుడిసె ప్రమాదవశాత్తు గతవారం రోజుల క్రితం కాలిపోయింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న బిజెపి నాయకుడు, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అక్కడికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి కుటుంబానికి 25కిలోల బియ్యం బస్తాను, అదేవిధంగా నిత్యావసర వస్తువుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటా నని, అధైర్య పడవద్దని అండగా ఉంటానన్నారు. అనంతరం వెంటనే సంబంధిత అధికారులకు మాట్లాడి వెంటనే ఇల్లును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేత

నవతెలంగాణ-బోధన్


సరుకులను అందజేస్తున్న షేక్ హైమద్ హుస్సేన్

రంజాన్ పండగను పురస్కరించుకుని సాలూర మండలం జాడిజమాల్పూర్ గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షేక్ హైమద్ హుస్సేన్ (బాబు) 45 నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి గ్రామానికి చెందిన 45 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరికి 10 కిలోల బియ్యం, పది రకాల పండగ సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం మైనార్టీలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ మజార్, బాలాజీ, షేర్‌ఖాన్, సుభాని, పాషా భాయ్, రాజమియా, లాల్ ఆహ్మద్, నజీర్‌మియా, బాబు ఖాన్, హైమద్ ఖాన్, జహీర్, బాబు ఖాన్, మునీర్, పాషా, అస్లాం, అల్లా ఖాన్, తోఫిక్ తదితరులు పాల్గొన్నారు.

సరైన ధృవపత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

సరైన ధృవపత్రాలు ఉంటేనే డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లతో కామారెడ్డి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కడ భూములు అమ్మినా.. కొన్నా డాక్యుమెంట్ రైటర్‌లు సరైన ధృవపత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రియల్టర్లు భూములు అమ్మేటప్పుడు, కొనేటప్పుడు సరైన పత్రాలు ఉంటేనే లావాదేవీలు చేయాలని, ఇలా చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. డాక్యుమెంట్ రైటర్‌లు, రియల్టర్లు భూ క్రయ, విక్రయాల విషయంలో ఎక్కడా అక్రమాలు లేకుండా సహకరించాలని అన్నారు. సరైన ధృవపత్రాలు లేకపోవడం వల్ల వ్యవసాయ భూములను, ప్లాట్లను కొనుగోలు చేసిన సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి సోమవారం పలువురు భారీగా చేరారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరారు. మండలంలోని ఆత్మకూర్ మాజీ సర్పంచ్ గడ్డం బాల్‌రెడ్డి, మాసంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ విట్టల్, మాటూర్ మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, జలాల్పూర్ గ్రామ మాజీ సర్పంచ్ బలరాంరెడ్డి, మాటూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బెస్త సత్యం, ఎండి సలీం, భిక్కనూర్ కిష్టయ్య, పసుల విటల్, చింతలపల్లి హనుమంతు, బాలనగర్ శ్రీనివాసరెడ్డి, సోమన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, బెస్త సురేందర్‌తో పాటు 50 మంది పార్టీలోకి చేరినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలి

- 7నెలల ఎరియర్స్ ఖాతాల్లో జమచేయాలి
- కామారెడ్డి జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి



పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని, 7నెలల ఎరియర్స్ ఖాతాల్లో జమచేయాలని కామారెడ్డి జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడం పట్ల నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ రోజు వరకు వేతనాలు అందకపోవడం చేత చాలా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, అయినప్పటికీ ఎక్కడా కూడా విధులను ఆటంకపరచకుండా రోగులకు నిరంతరం సేవలందిస్తున్నామని అన్నారు. అన్ని రకాల జాతీయ ఆరోగ్య పనులు సైతం ఆపకుండా సేవలు కల్పిస్తున్నామని, స్వీపర్ నుంచి మొదలుకొని డాక్టర్ల వరకు ప్రతి ఒక్కరం కష్టపడి వైద్య సదుపాయాలు అందిస్తున్నప్పటికీ జీతభత్యాలు రాకపోవడంతో కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత ప్రభుత్వం ప్రకటించిన పిఆర్సిలోని ఏడు నెలలకు సంబంధించి ఏరియర్స్ కూడా వైద్యశాఖ అందించలేదని, చాలీచాలని వేతనాలతో పని వెళ్ళదీస్తున్నా సరైన సమయానికి వేతనాలు రాకపోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా సమాన పనికి సమాన వేతనం, రెగ్యులర్‌గా జీతాలు, క్రమబద్ధీకరణ ఉంటుందని ఆశించినా నిరాశే మిగిలే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబ పోషణకు ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నేటి నుంచి ఈనెల 21 వరకు నిరసన కార్యక్రమాల్లో భాగంగా విధులు నిర్వహిస్తూనే ప్రతిరోజూ వివిధ పద్ధతుల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం అంటిముట్టనట్టు వ్యవహరించకుండా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బాధలను అర్థం చేసుకొని ప్రతి నెల ఒకటవ తారీఖున వేతనాలు అందేలా చొరవ చూపాలని అన్నారు. గత నాలుగు నెలల జీతాలు సైతం వెంటనే ఇవ్వాలని, ఎరియర్స్ ఖాతాలలో జమచేయాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియజేసుకుంటున్నామన్నారు. లేనియెడల నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఈ నెల 22 తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపట్టబోతున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కమిటీ సభ్యులు పసుపునూరి వెంకటరమణ, డా.వంగ రాహుల్ కుమార్, వరలక్ష్మి, బోర్రోల్ల సంధ్య కవిత, లక్ష్మి, హరినాథ్, రేణుక, పెనుగొండ సంధ్య, అర్షియా, దీవెన తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

పశువులకు గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి సంతోష్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నకొడప్‌గల్, చిల్లేర్గి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పశువైద్య నివారణ టీకాల నివారణ కార్యక్రమంలో భాగంగా చిన్నకొడప్‌గల్, చిల్లేర్గి గ్రామాలలో 354 పశువులకు, 649 గేదెలకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా మార్చి 15 నుండి 30 ఏప్రిల్ వరకు గ్రామాల వారీగా పశువైద్య బృందాలు పశువులకు టీకాలు వేయనున్న నేపథ్యంలో పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
4
నిజామాబాద్
మంగళవారం | మార్చి 19, 2024 | www.navatelangana.com

మద్దుల్ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మద్దుల్ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా అయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఆలయ కమిటీకి ఇచ్చిన హామీ ప్రకారం ఆలయంలో పాలరాతి విగ్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, చెలిమెల నర్సయ్య, భాషబోయిన రాజేందర్, రమేష్ గౌడ్, రాజా గౌడ్, గన్నారం నారాయణ, రాకేష్, రాజు, ఆలయ కమిటి అధ్యక్షుడు మిట్టపల్లి లస్మన్న పాల్గొన్నారు.

ఎంపీఓపై దాడి సరికాదు



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ఎంపీఓపై దాడి సరికాదని తెలంగాణ కలెక్టర్ పంచాయతీ వింగ్ మినీస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సంగ్రామ్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, కోడేరులో ఎంపీవోపై ఎంపీపీ దాడిని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా సమీకృత కార్యాలయంలోని పంచాయతీ కార్యాలయం ముందు డిపిఓ జిల్లా కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపివోపై దాడి చేయడం సరైన పద్ధతి కాదని, ఒక ఉద్యోగిని కొట్టడం వంటి హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో సోమవారం బాల్కొండ ఎస్సై కే గోపి ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో పలు వాహనాలను పరీక్షించి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు ఆన్లైన్లో విధించారు. పాత పెండింగ్ చాలాన్లను అన్ లైన్ లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై కే గోపి మాట్లాడుతూ వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని, వాహనాలు నడిపే వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఏఎస్సై రాజేశ్వర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ విట్టల్, జయవంతరావు, కానిస్టేబుల్స్ లింగం, సదానందం పాల్గొన్నారు

బీఎల్ఎఫ్ పార్లమెంటు అభ్యర్థిగా అశోక్ గౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా అబ్బగోని అశోక్ గౌడ్‌ను ఖరారు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో 17 స్థానాల్లో పోటీ చేసే పార్లమెంటు అభ్యర్థులను ప్రకటించినట్లుగా తెలిపారు. భారతీయ జనతా పార్టీ కేవలం రాజ్యాధికారం కోసమే మత పరమైనట కార్యక్రమాలను చేపడుతూ సామాన్య పేద దళిత బడుగు బలహీన వర్గాల ఓట్లను దండుకొని పట్టం కట్టుకుంటున్నాయని అన్నారు. భారతీయ జనతా పార్టీ బీసీ కులాలను ఇంతవరకు వారి దామాష ప్రకారం లెక్కించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తుందని మరి ఇంతవరకు బీసీ కులగణను చేపట్టలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను, నిరుద్యోగ సమస్యలను ఎన్నడూ కూడా పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌లో బిఎల్‌పి పార్టీతో పాటు ఎంసిపిఐ పార్టీ, బిసిపీ పార్టీ, లేబర్ కమ్యూనిస్టు పార్టీ కూటమితో కలిసి పోటీ చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎన్నికకు నాలుగు నామినేషన్ల దాఖలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బార్(న్యాయవాదుల)ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, శ్రీనివాస్ సోమవారం తెలిపారు. అధ్యక్ష పదవికి తెడ్డు నర్సయ్య ఉపాధ్యక్ష పదవికి శంకర్ ప్రధాన కార్యదర్శి బొల్లారం రాజ్ కుమార్, కోశాధికారిగా సుఖేష్ పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కృష్ణంరాజు, చిలుక సుభాష్ , కీర్తి సాగర్, చైతన్య శ్రీనివాస్, చరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన పసుపు పంపిణీ



విత్తన పసుపును అందజేస్తున్న అధికారి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని ప్రొఫెసర్ జయశంకర్ పసుపు పరిశోధన కేంద్రంలో సోమవారం విత్తన పసుపును రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు పసుపు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ తెలిపారు. కమ్మర్ పల్లి మండలంలోని చౌట్ పల్లి, హాస కొత్తూర్, కమ్మర్ పల్లి, మోర్తాడ్ మండలం షెట్పల్లి, మెండోరా మండలం రేంజర్ల, దోమకొండ గ్రామాలకు చెందిన రైతులు పరిశోధన స్థానంకు వచ్చి విత్తన పసుపును తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. పసుపు పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన దాదాపు 40 క్వింటాళ్ల దుగ్గిరాల ఎరుపు, పీతంబర్, సేలం, బిఎస్ఆర్-2 రకం విత్తన పసుపును రైతులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్

నష్టపోయిన పంటల పరిశీలన



వరిపంటను పర్శీఈలిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మూడు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్ కూమార్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లవెల్లి, మెగ్య నాయక్ తండాలో తోపాటు ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాల పైనే నష్టం జరిగిందని, వరి పంట తోపాటు మామిడి, చింతపండుకు తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితులు తమ దృష్టికి తీసుకొని వచ్చారని వివరించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి ని కోత కోసి కొనుగోలు కేంద్రాలకు తరలించగా అక్కడ కూడా వరి ధాన్యం తడిసిపోయిందని అన్నారు. ఇంకొన్ని చోట్ల పంట పొలంలోనే వడ్లు రాలిపోయి నీళ్లలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వేంట మండల అధ్యక్షులు నాయిడి రాజన్న, రైతులు తదితరులు ఉన్నారు. ఫోన్లో వ్యవసాయ శాఖ అధికారులకు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వారి దృష్టికి తీసుకొని వచ్చారు.

సంతల వేలం.. సిండికేట్‌కు సర్వం సిద్ధం

- నవీపేట్ మేకల, వారంతపు సంతల వేలం రెండుసార్లు వాయిదా
- అప్‌సెట్ ప్రైస్ రాకుండా అడ్డుకట్ట
- మధ్యవర్తుల బేరసారాలు
- మూడోసారి అప్సెట్ అయ్యేనా?
- నష్టపోనున్న గ్రామపంచాయతీ
- మూడు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు కరువు
- ప్రేక్షక పాత్రలో అధికార యంత్రాంగం

నవతెలంగాణ-నవీపేట్

జిల్లాలోనే అత్యధిక ఆదాయం వచ్చే నవీపేట్ మేకల, వారంతపు సంతల వేలంలో తలపండిన కాంట్రాక్టర్‌లు సిండికేట్‌కు సర్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మేకల సంత వేలం గత సంవత్సరం 55లక్షల16వేలు పలకగా, వారాంతపు సంత 15 లక్షలు పలికింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో రెండుసార్లు నిర్వహించిన మేకల సంత వేలం పాటకు మొదటిసారి 28 మంది, వారాంతపు సంతకు 10మంది వేలం పాటదారులు హాజరుకాగా మేకల సంతకు 39 లక్షలు, వారంతపు సంతకు ఒక లక్ష రూపాయలు మాత్రమే మజరొద్దీన్ పలకడంతో అప్ సెట్ ప్రైస్ రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేశారు. తిరిగి 13న వేలంపాట నిర్వహించగా మేకల సంత వేలం పాటలో 49 మంది పాల్గొనగా 40 లక్షల 35 వేలకు, వారాంతపు సంత వేలంలో 24 మంది పాల్గొనగా 4.61 లక్షలకు మజరోద్దీన్ పాట పాడగా అప్ సేట్ ప్రైస్ రాకపోవడంతో రెండవసారి అధికారులు మంగళవారానికి వాయిదా వేశారు.

సిండికేట్ కు సర్వం సిద్ధం..

మేకల, వారంతపు సంతల వేలం పాటలను ఎంపీడీవో నాగనాథ్, ఎంపీఓ రామకృష్ణ, కార్యదర్శి రవీందర్ నాయక్ సమక్షంలో నిర్వహించగా వేలం పాటదారులు కొంతమంది మాత్రమే వేలంలో పాల్గొనగా పంచాయతీ ఆవరణలో పాత కాంట్రాక్టర్లకు వత్తాసుగా మధ్యవర్తులు వేలం పాటదారులతో బేరసారాలు నిర్వహించారు. మేకల సంత వేలం సుమారు 40 లక్షల వరకు, వారాంతపు సంత 5 లక్షల వరకు తమ సొంతమైతే పాటదారులకు 10 వేల చొప్పున గుడ్ విల్ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకునేందుకు బహిరంగంగానే బేరసారాలు నిర్వహించినట్టు సమాచారం.

మూడోసారి అప్సెట్ అయ్యేనా?

నేడు మంగళవారం మూడోసారి మేకల వారాంతపు సంతలకు వేలం నిర్వహించాల్సి ఉండగా వేలంలో అప్ సెట్ ధర రాకుండా అడ్డుకట్ట వేసేందుకు విశ్వ ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రచారంలో ఉంది. మూడోసారి కూడా అప్సెట్ ధర రాకపోతే మళ్లీ వేలం వాయిదా వేసి పంచాయతీ కార్యదర్శి, డిఎల్‌పిఓ, డిపిఓలు జిల్లా కలెక్టర్ కు సమాచారం అందించి చివరి నిర్ణయం తీసుకుంటారు. కాగా గుడ్ విల్ కోసం ఆశపడుతున్న కొంతమంది మళ్లీ అప్ సెట్ అవుతారని తెలియక పాత కాంట్రాక్టర్లకి వత్తాసు పలుకుతున్నారు.



మూడు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు కరువు..

మేజర్ గ్రామపంచాయతీ నవీపేట్‌లో 40 మంది సఫాయి కార్మికులు 8 మంది పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వీరి జీత భత్యాలు మేకల, వారాంతపు సంత వేలంపైనే ఆధారపడి ఉంటాయి. అటువంటి వేలం పాటను సిండికేట్ చేసేందుకు కొంతమంది పెద్దలు, యువకులతో పాటు అధికార యంత్రాంగాన్ని మచ్చిక చేసుకుని కాంట్రాక్టర్ వేలల్లో ఖర్చు చేసి లక్షల్లో ఆదాయం సమకూర్చుకునేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాబట్టి జిల్లా పాలన అధికారితో పాటు యంత్రాంగం స్పందించి వేలం పాటలను పారదర్శకంగా నిర్వహించే విధంగా కృషిచేసి గ్రామపంచాయతీ ఆదాయాన్ని గణనీయంగా పెంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రేక్షక పాత్రలో అధికార యంత్రంగం

నవీపేట్ మేజర్ గ్రామపంచాయతీకి ప్రధాన ఆదాయపు వనరులైన సంతల వేలంపాటలో బహిరంగంగానే పాటదారులను వేలం పాట పాడకుండా ఒత్తిళ్లు చేస్తున్న అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించడం పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంట్రాక్టర్లు కారోబార్ నుండి కలెక్టర్ల దాకా మామూళ్లు సమకూర్చి తమకు అనుకూలంగా వేలంలను దక్కించుకోవడమే కాక కిస్తులను కట్టే విషయంలో సైతం పాలకవర్గంతో కుమ్మక్కై, ఇష్టారాజ్యంగ చెల్లింపులు జరుపుతున్నారని బహిరంగంగానే పలువురు విమర్శిస్తున్నారు. కాబట్టి జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవ చూపి గ్రామ పంచాయతీకి గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చేందుకు దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బోర్గాం(పి)లో వీడీసీల ఆగడాలు

- కులబహిష్కరణ కేసులు నమోదు
- చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా నాల్గవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బోర్గం (పి) గ్రామంలో వీడీసీల ఆగడాలు మితిమీరుతున్నాయి. అదే పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో అనేక పర్యాయాలు వివిధ కులాలకు చెందిన వారిని కుల బహిష్కరణ చేసిన విషయం అందరికీ తెలిసిందే. అలాగే నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌కు సంబంధిత ఎస్ఐ, సిఐలకు సమాచారం అందించి మరీ కేసులను నమోదు చేశారు. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. అయితే పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గ్రామాల్లో డీసీలు చట్టానికి విరుద్ధంగా పనిచేయకూడదని అలా చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించినప్పటికీ ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ అభివృద్ధి కమిటీలకు తలొగ్గి పనిచేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఆదివారం బోర్గం (పి) గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డిని కులబహిష్కరణ చేయడంతో ఆయన కుటుంబ సభ్యులు నాలుగో టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. 15 రోజుల క్రితం గంగారెడ్డి అనే వ్యక్తిని కుల బహిష్కరణ చేశారు. కొన్ని నెలల క్రితం పద్మశాలి కులస్తులపై కుల బహిష్కరణ చేశారు. వీడీసీలు గ్రామాభివృద్ధికి కృషి చేయకపోగా స్వార్థప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. వీడీసీలు గ్రామాభివృద్ధి కోసం పాటుపడాలని, స్వప్రయోజనాలు కోసం పనిచేస్తే శిక్ష తప్పదు అని సీపీ కల్మేశ్వర్ హెచ్చరించిన వీడీసీల తీరు మారడం లేదు. అయితే ఈ విషయంలో పోలీసులు ఏ విధంగా వ్యవహరిస్తారని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కమిషనర్ సైతం ఏ విధంగా వ్యవహరిస్తారనేది ప్రతి ఒక్కరు గ్రామంలో ఆసక్తికరంగా వేచి చేస్తున్నారు.

అందుబాటు ధరలో మోకాళ్ల ఆపరేషన్

- వైద్యులు దాచేపల్లి సునీల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మధ్యతరగతి కుటుంబీకులు సైతం మోకాళ్ళ ఆపరేషన్ తక్కువ ఖర్చులతో చేసుకునే అవకాశం ఉంటుందని యశోద సోమాజిగూడ లో పని చేసే డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. యశోద సోమాజిగూడ వారు సోమవారం నగరంలోని ఓ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోకాలి చిప్పల ఆపరేషన్‌కు రోగులు ఇబ్బంది పడకుండా చికిత్స చేయబడుతుందని, వారు వ్యక్తిగతంగా స్వతహాగా బాత్రూం వెళ్లి చివరి క్షణాల వరకు వ్యక్తిగత పనులు చేసుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. దానికి యశోదలో రొబొటిక్ ద్వారా మోకాళ్ళ మార్పిడి చికిత్సను సులభంగా చేయడం జరుగుతుందని వివరించారు. రోబోటిక్ ఆపరేషన్ ద్వారా రోగి తొందరగా కోలుకోగలుగుతాడని, రెగ్యులర్ ఆపరేషన్ల కంటే సుమారు 50వేల వరకు తక్కువ డబ్బు ఖర్చు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మేనేజర్ రాజ్ కుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 20న వివాహం జరగాల్సి ఉండగా ముందస్తుగా సమాచారం అందుకున్న ఐసిడిఎంఎస్ సిడిపిఒ స్వర్ణ లత గ్రామానికి వెళ్ళి బాల్య వివాహం జరగకుండా అడ్డుకున్నారు. అ అమ్మాయికి ప్రస్తుతం 15 ఏళ్ళు, మైనర్ అమ్మాయికి సిరికొండకు చెందిన వేణుగోపాల చారితో బాల్యవివాహం చేయడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఆ అమ్మాయి ప్రస్తుతం గన్నారం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న అధికారులు అమ్మాయి కుటుంబ సభ్యులకు బాల్యవివాహం చేస్తే జరిగే అనర్థాలు గురించి వివరించారు. బాల్యవివాహం జరిగితే చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డిచ్ పల్లి సీడీపీఓ స్వర్ణలత, ఐసీపీస్ కౌన్సిలర్ జమురు , ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభ , ఇందల్ వాయి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్, ఇందల్వాయి రెవిన్యూ ఇన్సెపెక్టర్ మోహన్ , గ్రామస్తులు అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు ఐదు కోట్ల నిధులు మంజూరు

నవతెలంగాణ మోర్తాడ్

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీ పెద్దన్న తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పిఎం ఉషా పథకం కింద 13 కళాశాలలకు నిధులు మంజూరు కాగా నిజాంమాబాద్ జిల్లా నుండి మోర్తాడ్ కళాశాలకు మాత్రమే ఐదు కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు నిధులు మంజూరుకు కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ నిధులతో కళాశాల మౌలిక వసతులు, క్లాస్ రూమ్‌లో ల్యాబ్, గ్రంథాలయం తదితర అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సోమవారం బెయేర్షెబా చర్చి, డిచ్‌పల్లిలో ఎస్ఆర్‌పిఎ జనరల్ బాడీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని 7 మండలాలు డిచ్ పల్లి, నిజామాబాదు రూరల్, మోపాల్, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల్లోని పాస్టర్స్, నిజామాబాదు జిల్లా టియుపిఎ కమిటీ, ఎబిసిసి కలిసి రానున్న 2024 నుండి 2026 మార్చ్ వరకు గాను నియోజకవర్గ నూతన కార్యవర్గంను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా పాస్టర్ మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ జి. ఆమోస్, కార్యదర్శి పాస్టర్ ఎం బాలస్వామి, కోశాధికారులు రెవ జి. దినకర్, పాస్టర్ టి ప్రసాద్, ఉపాధ్యక్షులు రెవ స్టీవెన్ కుమార్ (నడి పల్లి), రెవ డి. అబ్రహాం(రూరల్), రెవ కె. హనోక్ (సిరికొండ), పాస్టర్. డేవిడ్ (జక్రాన్ పల్లి), పాస్టర్ డి.సామ్యూల్ (ఇందల్వాయి), పాస్టర్ ఎ. సుధీర్ (ధర్పల్లి), రెవ. థామస్(మోపాల్). జాయింట్ కార్యదర్శి పాస్టర్. ఎన్. దేవదాస్, పాస్టర్ జేమ్స్, ఆర్గనైజయింగ్ కార్యదర్శులు బ్రదర్. రాబర్ట్ వాసా, బ్రదర్ జి. అబ్రహాం, బ్రదర్ ఎబినేజర్, కార్యవర్గ సభ్యులు పాస్టర్ ఫెరెస్ ఆశీర్వాదం(మోపాల్), పాస్టర్. జ్ఞానందం (రూరల్), పాస్టర్. ప్రకాష్ (జక్రాన్‌పల్లి), పాస్టర్ యోహాన్ (ఇందల్వాయి), సలహాదారులు రెవ డి యేసు కుమార్, పాస్టర్ డి. మోషే, పాస్టర్ . యేసు రత్నంలను టియుపిఎ నిజామాబాదు జిల్లా అధ్యక్షులు రెవ. వి జెకర్యా ఆనంద్ ఎబిసిసి ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని బద్దంవాడ సంఘానికి చెందిన సంఘ సభ్యులు 40 మంది బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. రైతు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతోందని రైతులు అన్నారు. 40 మంది రైతులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వై శ్రీనివాస్, బి మైపాల్, అశోక్, రమేష్ గోపి, గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ పీఠం ఎవరికో?

- 21న చైర్‌పర్సన్ ఎన్నిక
- చక్రంతిప్పిన హస్తం



లావణ్య శ్రీనివాస్



సంగీత శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

మూడు నెలల నుండి రసవత్తరంగా మారుతున్న ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం తీవ్ర చర్చనీయాంశంగా అయింది. ఈనెల 21న గురువారం ఎలక్షన్ కమిషనర్ చిట్ల పార్థసారథి చైర్ పర్సన్ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయడం. ఆశావాహులు తమకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లను క్యాంపుకు తరలించడం జరిగింది.

గత కొన్ని నెలల నుండి..

గత మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ కౌన్సిలర్ల మధ్య వివాదాలు చిలికిచిలకి గాలివానలాగా మారి, గత రెండున్నర సంవత్సరాల క్రితమే అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నించగా, అప్పటి ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సముదాయించారు. గత సంవత్సరం డిసెంబర్ 12న 24 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని వినతిపత్రం అందజేశారు. దీంతో గత జనవరి 4 గురువారం ఆర్డీవో మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన సమావేశాన్ని నిర్వహించిన స్పెషల్ ఆఫీసర్ అప్పటి ఆర్డిఓ వినోద్ కుమార్, కలెక్టర్‌కు నివేదించారు.ఈ నివేదికను కలెక్టరు, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ (సిడిఎంఏ)కు పంపారు. సిడిఎంఏ వైస్ చైర్మన్‌కు ఇన్చార్జ్ చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ కావడం. నూతన చైర్పర్సన్ ఎన్నిక నిర్వహించడానికి తేదీని కూడా ఖరారు చేసి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ అధికార మార్పు ప్రక్రియ పూర్తి కావడంలో ఆలస్యం జరుగుతుండడంతో చైర్ పర్సన్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు తమకు అధికారిక ఉత్తర్వులు రాలేదు కాబట్టి తానే చైర్‌పర్సన్ అంటూ పండిత్ వినీత మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు కొన్ని రోజులు వచ్చారు.

చక్రం తిప్పిన హస్తం..

అధికార పార్టీ అండ ఉంటే గానీ తాము చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించలేమని భావించిన ఆశావాహులు తమతో ఉన్న కౌన్సిలర్లను ప్రోత్సహించడంతో పాటు వైస్ చైర్మన్‌తో సహా 14 మంది కౌన్సిలర్లు నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డికి గట్టి షాక్ తగిలినట్లు అయింది. అధికారం చేజారి పోకుండా ఉండేందుకు మాజీ చైర్ పర్సన్ పండిత్ వినీత వర్గీయులు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు అప్పీలు చేసుకోగా కేసును న్యాయమూర్తి డిస్మిస్ చేయడం.... వ్యతిరేక కౌన్సిలర్ల వర్గం తమ సంఖ్య బలాన్ని చూపుతూ హైకోర్టు చుట్టూ తిరుగుతూ రెండున్నర నెలలుగా చైర్మన్ పీఠం కోసం ఇరు వర్గాలు ఎత్తులకు పైఎత్తులు వేశారు. మరోవైపు ఇంచార్జ్ చైర్మన్ బాధ్యతలు అప్పగించాలంటూ పట్టణంలోని కెనాల్ బ్రిడ్జిపై ముస్లింలతో వైస్ చైర్మన్ షేక్ మున్న ధర్నా నిర్వహించి కోర్టును సైతం ఆశ్రయించారు. దీంతో మున్సిపల్ రాజకీయం గందర గోళంగా మారింది.

తాత్కాలిక ఉత్తర్వులు..

ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తుండడం..మున్సిపల్ బడ్జెట్ సమావేశంనకు అధ్యక్షత వహించేందుకు 2023 ..24 ఆర్థిక సంవత్సరం ముగింపు వస్తుండడంతో బడ్జెట్ సమావేశం నిర్వహించేందుకు ఈనెల 6న బుధవారం ఇంచార్జ్ చైర్మన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈనెల 15న మున్సిపల్ సాధారణ సమావేశం 38 అంశాలకు గాను 36 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఒక్కొక్క వార్డుకు ఐదు లక్షలు కేటాయించి అత్యవసర పనులు చేపట్టనున్నట్లు తెలుపగా ఇందులో 84 లక్షల డీజిల్ బిల్లులు ఇతర కుంభకోణంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గ్రీన్ బడ్జెట్ పేరు మీద మొక్కలు నాటకుండానే లక్షలు కాజేశారని ఆరోపించారు. ఇరిగేషన్, అసైన్డ్, లేఅవుట్ కానీ స్థలాల్లో ఓపెన్ ప్లాట్ లకు ఇంటి నంబర్లు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారని దీనిపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో హస్తం గూటికి చేరకముందు కౌన్సిలర్లు క్యాంపులకు వెళ్లారు. ప్రస్తుతం ఈనెల 21 గురువారం నిర్వహించనున్న మున్సిపల్ చైర్ పర్సన్ పదవిపై ఆశావాహులు కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు.

చైర్మన్ పీఠం ..బిసి మహిళకు రిజర్వు...

గత మూడు నెలల నుండి జరుగుతున్న రాజకీయ పరిణామాల నుండి ఈ 21న నిర్వహించే ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. బిసి మహిళకు రిజర్వు చేయడంతో పట్టణంలోని రెండవ వార్డు కౌన్సిలర్ కాందేశ్ సంగీత శ్రీనివాస్, 23వ వార్డు కౌన్సిలర్ వన్నెల దేవి లావణ్య శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. కాగా సంగీత మూడుసార్లు కౌన్సిలర్‌గా విజయం సాధించడంతో పాటు న్యాయవాదిగా సైతం కొనసాగుతూ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నారు. ఆమె భర్త శ్రీనివాస్ సైతం క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. 2008లో కాంగ్రెస్ హయాంలో, 2014 ..2020 లో బీఆర్ఎస్ హయాంలో వైస్ చైర్మన్ పీఠం కోసం ప్రయత్నాలు చేశారు. కాగా వన్నెల దేవి లావణ్య మొట్టమొదటిసారి కౌన్సిలర్‌గా విజయం సాధించి చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. ఆమె భర్త అయ్యప్ప శ్రీనివాస్ సిద్దుల గుట్టపై సొంత డబ్బులతో అయ్యప్ప దేవాలయం నిర్మించి రాజకీయ వ్యవహారాలు చక్కబెడుతూ వస్తున్నారు. వీరిద్దరూ పట్టణంలో బలమైన సామాజిక వర్గాలకు చెందిన వారు కావడం, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు సామాజిక వర్గాల ఓట్లు కీలకం కావడం గమనార్హం. ఒక సంవత్సర పాలనపై చైర్ పర్సన్ పదవి ఎవరిని వరిస్తుందో అధికార హస్త నాయకులు ఎటు మొగ్గుచూపుతారో వేచి చూడాల్సిందే.

ఎమ్మెల్యేను కలిసిన లింగంపల్లి గ్రామస్తులు



నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావును హైదరాబాద్‌లోని వారి నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. లింగంపల్లి(ఖుర్దు) కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. గ్రామాభివృద్ధిపై ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అభివృద్ధికి సహకరిస్తానని హామీనిచ్చారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరిస్తానని, గ్రామ రూపురేఖలు మారుస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కాశీరాం, సురేందర్‌గౌడ్, సాయిరాం, కొత్త పోచయ్య, సవడం నారాయణ, యూత్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హున్సా సొసైటీలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హున్స సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని సంఘం కార్యదర్శి హన్మంత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన సన్‌ఫ్లవర్ పంటను దళారులకు అమ్ముకోకుండా సొసైటీలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. క్వింటాకు సన్‌ఫ్లవర్‌కు ప్రభుత్వం రూ.6760 ధర చెల్లిస్తున్నందున కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు రమేష్, వినోద్‌రావు, సంజు పటేల్, సంగ్రామ్ పటేల్, రాములు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

- కేంద్రాల వద్ద సందడి

నవతెలంగాణ-విలేకరుల బృందం

పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. మొదటిసారి బోర్డు పరీక్షలు రాయనుండడంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన కూడా కనిపించింది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు వచ్చి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించి పరీక్ష కేంద్రాలకు పంపించారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. సిబ్బంది విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి కేంద్రాల్లోకి అనుమతించారు.

పెద్దకొడప్‌గల్ : మండల వ్యాప్తంగా 209 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. ముగ్గురు పరీక్షలకు గైర్హాజరైనట్టు సిఎస్ రమణారావు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా కేంద్రాల వద్ద పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎంఈఓ దేవిసింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉందని ఆయా కేంద్రాలకు సమీపంలో ఎవరూ ఉండాలని పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీస్ ఇబ్బంది కోరారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో 10 పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో గల జెడ్‌పి హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు గాను 220 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 179 మంది విద్యార్థులకు గాను 178 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కేవలం ఒకే విద్యార్థిని పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో వెంకటేశం తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలలో 399 మంది విద్యార్థులకు గాను 398 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

నిజాంసాగర్ : మండల వ్యాప్తంగా మూడు సెంటర్లను ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి దేవిసింగ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆయన తెలిపారు. మొత్తం 442 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 440 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

రెంజల్ : మొదటి రోజు ఆదర్శ పాఠశాలలో 220 మంది విద్యార్థులు, నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో 121 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. ఒక విద్యార్థి మాత్రం గైరాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు పేర్కొన్నాడు. 338 మంది విద్యార్థులకు గాను 337 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఆయన తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు.

ఎడపల్లి : మండల వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు మండల విద్యాశాఖ అధికారి రామారావు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు రమేష్, జోన్స్ లక్ష్మీకాంతరావు తెలిపారు.

తొలిరోజు ఆరుగురు గైర్హాజరు..

బోధన్ : మండలంలో ఎస్సెస్సీ పరీక్షలకు తొలిరోజే ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. బోధన్, సాలూర మండలాల్లో 2915 మంది ఎస్సెస్సీ పరీక్షలకు హాజరుకావలసి ఉండగా వారిలో 2905 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. పదవ తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా 5 నిమిషాల గ్రేస్ టైమింగ్ పెంచడంతో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని పరీక్షలు రాశారు. పరీక్షలకు హాజరై విద్యార్థులకు సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించారు. పరీక్షల కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. తొలిరోజు పరీక్షలకు హాజరైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు, వారి పిల్లలకు అన్ని రకాల జాగ్రత్తలు చెపుతూ విద్యార్థుల పరీక్ష ముగిసే వరకు పరిసర ప్రాంతాలలోనే వేచి ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థినికి అత్యవసర చికిత్స..

బోధన్ పట్టణంలోని వంశీ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలకు హాజరయిన ఓ విద్యార్థి తీవ్ర కడుపునొప్పితో బాధపడడంతో విధులలో ఉన్న సిబ్బంది తక్షణమే స్పందించి వైద్య చికిత్సలు అందించారు. దాంతో కోలుకున్న విద్యార్థిని యధావిధిగా పరీక్షలు రాసినట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్, బోధన్ ఎంఈఓ నాగనాథ్ తెలిపారు.

తెలుగు పరీక్షకు ముగ్గురు గైర్హాజరు..

సదాశివనగర్ : పదవ తరగతి తెలుగు పబ్లిక్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారి యోసప్ తెలిపారు. 614 మంది విద్యార్థులకు 611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కల్వరాల్ సెంటర్‌లో 90 మందికి 87 మంది హాజరయ్యారు. సదాశివనగర్‌లో 136 మోడల్ స్కూల్‌లో 239 అడ్లూర్ ఎల్లారెడ్డిలో 149 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మొదటి రోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం..

పిట్లం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత ఉర్దూ మీడియం బాలుర ఉన్నత పాఠశాలల్లో మొదటిరోజు నిర్వహించిన పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో 519 మంది విద్యార్థిని విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైరాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ఇన్విజిలెటర్లు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో రెడ్డిపేట సెంటర్లో 165 మంది విద్యార్థులకు గాను 165 మంది విద్యార్థులు, రామారెడ్డి సెంటర్లో 185 మంది విద్యార్థులకు గాను 184 మంది విద్యార్థులు హాజరై, ఒకరు గైర్హాజరు అయ్యారు. ఉప్పల్‌వాయి సెంటర్లో 153 మంది విద్యార్థులకు గానూ 153 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ యోసేఫ్ తెలిపారు.



పెద్దకొడప్‌గల్ : రూమ్‌నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు..



నాగిరెడ్డిపేట్ : పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థుల తనిఖీ..



రామారెడ్డి : పరీక్షా కేంద్రానికి క్యూలో వెళ్తున్న విద్యార్థులు



బోధన్ : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని ముదెల్లి గ్రామంలో కొన్ని రోజుల క్రితం ఇద్దరు స్కూల్ విద్యార్థులు మిద్దెల రవీందర్, సుతారి శశాంక్ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ గ్రామంలోని వారి ఇండ్లకు సోమవారం వెళ్లి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అలాగే గాంధారి మండల గౌరారం గ్రామ బిఆర్ఎస్ కార్యకర్త బెగరి పోచయ్య తల్లి ఇటీవలే అనారోగ్యంతో మరణించిందని, దీంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మేరుకుల సంఘం సభ్యులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మేరుకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, రోడ్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేరు కులస్తుల అభ్యున్నతికి చేయూతనిచ్చేందుకు గానూ మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం, నిజాంసాగర్ మండలాల అధ్యక్షులు కొవ్వూరి శివకుమార్, కార్యదర్శులు శ్రీధర్, పవన్‌కుమార్, కోశాధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం

నవతెలంగాణ-జుక్కల్

జిల్లాలోని పలు మండలాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మద్నూర్, నసురుల్లాబాద్, భిక్కనూర్, ఎర్రపహాడ్ రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని, జిల్లాలోని రైతులు తమ సమస్యలపై అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

తల్లిపాలు, రక్తహీనత వారోత్సవాలు



వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని నేరల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల బామన్‌సింగ్ తాండా అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాలు, రక్తహీనత వారోత్సవాల సందర్భంగా తల్లులకు, బాలికలకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వినోదిని మాట్లాడుతూ బాలింతలు, బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వినోదిని, అంగన్వాడీ టీచర్ లత, ప్రైమరీ స్కూల్ టీచర్ ప్రతిభ రాణి, వాసవీ బాలింత మహిళలు పాల్గొన్నారు.

కౌలాస్ జీపీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామంలో ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షల మంజూరవడంతో సీసీ రోడ్డు పనులను కౌలాస్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. గ్రామంలోని విధులలో రోడ్డు లేక వర్షకాలంలో ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌ను సీసీ రోడ్డు వేయించాలని గ్రామస్తులు కోరగా.. ఈజీఎస్ నిధులు మంజూరు చేశారని తెలిపారు.

కాంగ్రెస్ బలంగా ఉంది

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికార నివాసం నందు సోమవారం కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పార్టీ అనుసరించాల్సిన వ్యవహారాలను చర్చించారు. జహీరాబాద్ పార్లమెంట్ ఈసారి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. ఈ సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఆయన సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ మత్స్య సహకార ఎన్నికలు ఏకగ్రీవం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. సోమవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సిహెచ్ రోజా (జూనియర్ ఇన్‌స్పెక్టర్ అఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్) అధికారి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి, ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం అధ్యక్షులు భరత్‌కుమార్ గంగపుత్ర, ఉపాధ్యక్షులు ముత్యం రాములు, కార్యదర్శి-గువ్వల మొగులయ్య డైరెక్టర్స్ 1పెద్ద మోహన్, 2.వంగల మోహన్, 3.శ్రీకాంత్, 4.వినయ్ కుమార్, 5.సంజీవ్, 6.సాయులును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి, గంగమ్మ తల్లి మందిరం నిర్మాణానికి పూర్తి చేయుటకు కృషి చేస్తానని, నూతన అధ్యక్ష కార్యదర్శి భరత్ కుమార్, మొగులయ్య తెలిపారు. ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ

నవతెలంగాణ-మద్నూర్

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మద్నూర్ మండల కేంద్రంలోని మద్నూర్ 7 అంగన్వాడీ కేంద్రం పరిధిలో లబ్ధిదారులందరికీ సోమవారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మద్నూర్ ఐసిడిఎస్ సిడిపిఓ సునంద హాజరై మాట్లాడారు. రక్తహీనత ఎంసీ చెకప్స్ గురించి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, అంగన్వాడీ టీచర్లు కళావతి, చెంపబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను పకడ్బందీగా చేపట్టాలి

- సామాజిక తనిఖీ సమావేశంలో అదనపు పిడి వామన్‌రావు



పెద్దకొడప్‌గల్ : రూమ్‌నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు..

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో ఉపాధి హామీలో భాగంగా చేపట్టే పనులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు అదనపు డైరెక్టర్ వామన్‌రావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన పనులపై సామాజిక 14వ తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిడి వామన్‌రావు మాట్లాడుతూ.. ఉపాధిహామీలో భాగంగా 2022-23వ సంవత్సరం గ్రామాలలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టి సమావేశం నిర్వహించామన్నారు. ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ మస్టర్ రికార్డులు విధిగా చేపట్టాలని, ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు లేకుండా చూసేందుకు సామాజిక తనిఖీ ఏడాది కోసారి చేపట్టనున్నట్టు వివరించారు.

మండలంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో నాటిన మొక్కలు చనిపోవడంతో వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని అధికారులకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పారదర్శకతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎవీవో దత్త్రాద్రి, ప్రశాంత్, ఎంపిడిఒ రమేష్, పూర్వపు ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎస్‌ఆర్‌పి సాయిలు, ఎంపివో తిరుపతి, ఏపిఓ రజనీ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలపై దృష్టి సారించాలి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

నవతెలంగాణ-మద్నూర్

సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్‌లపై దృష్టి సారించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలపై పోలీస్, రెవెన్యూ అధికారులతో మద్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 05-జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 013- ఎస్సీ జుక్కల్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు డి.శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఎన్నికలు సజావుగా సాగడానికి పోలీస్, రెవెన్యూ అధికారులు పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లలో తాగునీరు, విద్యుత్, వికలాంగులకు ర్యాంప్‌లు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దులో నిఘా విభాగం, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో బాన్సువాడ డీఎస్పీ, సీఐ జగదం నరేష్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, 7మండలాల తహసీల్దార్లు, మద్నూర్ తహసీల్దార్ ఎం.డీ ముజీబ్, డిప్యూటీ తహసీల్దార్ భరత్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావర్ శంకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాష్ట్ర సరిహద్దును సందర్శన..

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగడానికి తెలంగాణ రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర బార్డర్‌ను ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్, డి.టి.భరత్, గిర్ధావర్ శంకర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ వద్ద బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు సాప శివ రాములు నేత హాజరై మాట్లాడుతూ.. సంఘాల ఆధ్వర్యంలో చేసిన దశాబ్దాల పోరాట ఫలితం వల్ల నేడు బీసీ కులాలకు న్యాయం జరిగిందన్నారు. తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణలో 16 బిసి, ఓసి, ఎస్సి, కులాలను కలుపుకొని 16, కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇంతవరకు సంతోషించదగ్గ విషయమైనప్పటికీ మిగతా బీసీ కులాలైన రజక, నాయిబ్రాహ్మణ, కుమ్మర, వడ్ల, కమ్మర, అవుసుల, కంసాలి, పాముల, దాసర మొదలగు ఇంకా ఎన్నో కులాలు వెనుకబడిన కులాలున్నాయని, వాటన్నింటినీ కార్పొరేషన్లుగా మారిస్తే అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, బిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ అలీ షబ్బీర్‌ల ఫోటోలకు క్షీరాభిషేకం చేసినట్టు తెలిపారు. బీసీల లెక్కలు తీసి దామాషా ప్రకారంగా బిసి కులాలకు ఒక్కొక్క కార్పొరేషన్‌కు 6000 కోట్లతో నిధులు ఇవ్వాలన్నారు. మిగతా కులాలను కూడా కార్పొరేషన్లకు మార్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కామారెడ్డి జిల్లా తరపు నుంచి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ లత, గౌరెల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మర్కంటి భూమన్న, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మారోజు మోహనాచారి, హాజీ అబ్దుల్ అజీజ్, నాగోజి నారాయణరావు, అల్వాల గోపాల్, జొన్నల రమేష్, లింగయ్య, అంబేద్కర్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లన్న, జిల్లా సహాయ కార్యదర్శి మెరుగు రవికుమార్, దోమకొండ మండల ఉపాధ్యక్షులు ఎం.వెంకటస్వామి, రాజయ్య, కిషోర్,